సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 29 । నవంబర్ । 2023



నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయండి

అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. -8లో



ప్రశాంతతకు నిలయం.. పరిపేతురు ఆలయం

కలసపాడు సగిలేరు ఒడ్డున పరిశుద్ధ పరిపేతరు పరిపాలు ఆలయం ప్రశాంతతకు నిలయంగా మారింది. -8లో

గరిష్టం/కనిష్టం
32.9/22.2

వాతావరణం

జిల్లాలో మంగళవారం 22.2 - 32.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు ఓటర్ల జాబితా పరిశీలకుని రాక

కడప సెవెన్‌రోడ్స్: ఎన్నికల రోల్ అబ్జర్వర్ బి.మురళీధర్ బుధవారం కడపకు రానున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు కలెక్టరేట్‌లో సమ్మరి రివిజన్ ఆఫ్ ఫోటో ఎలక్టోరోల్స్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కార్తీకమాసం సందర్భంగా కడప డిపో నుంచి డిసెంబర్ 4న సోమవారం అరుణాచలానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు తెలిపారు. ముందస్తుగా రిజర్వేషన్ చేసుకొనే వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్‌టీసీ ఆన్‌లైన్.ఇన్ తిరుమణ్ణామలై సరీ్వసు నెంబరు 6001, 6002 ద్వారా సీట్లు రిజర్వు చేసుకోవచ్చన్నారు.అలాగే కడప ఆర్టీసీ బస్టాండులో రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ పొందవచ్చన్నారు. పెద్దలకు రూ.1050, పిల్లలకు రూ.570 గా చార్జీ నిర్ణయించామన్నారు. ఈ సర్వీసులు ఉదయం 5 గంటలకు, 5.30 గంటలకు బయలుదేరుతాయన్నారు. భక్తులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు గండిలో టెండర్లు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధికి సంబంధించి ఖాజీపేట, చక్రాయపేట మండలాల్లో ఉన్న భూమిని కౌలుకు ఇచ్చేందుకు, స్వామి వారి అలంకరణ నిమిత్తం పూల సరఫరాకు సంబంధించి ఈనెల 30న షీల్డ్ టెండర్, బహిరంగవేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. ఖాజీపేట మండలంలో ఉన్న 1.55 ఎకరాలు, చక్రాయపేట మండలంలోని 0.10 సెంట్ల భూమిని 3సంవత్సరాల కాల వ్యవధితో ఇవ్వనున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు రు.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.అలాగే సంవత్సర కాలం పాటు స్వామి వారి అలంకరణకు పూలు సరఫరా చేయడానికి ఆసక్తి కలవారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని చెప్పారు.షాపింగ్ కాంప్లెక్‌లో ఖాళీ గదులను అద్దెకు పొందాలను కునే వారు 30 వేలు డిపాజిట్ చెల్లించాలని చెప్పారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎం. దివ్య



చిన్నికృష్ణ

కడప స్పోర్ట్స్: ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు చెన్నూరు మండలం రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో వైఎస్సార్ జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించిన ఎం. దివ్య, ఎస్. చిన్నికృష్ణలు చక్కగా రాణించి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్లకు ఎంపికయ్యారు. అదే విధంగా ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ఎన్‌టీఆర్ జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి పోటీల్లో సి. సంకీర్తన, కె. లోకేష్‌లు ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. వీరంతా డిసెంబర్‌లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు రామనపల్లె జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కె. రెడ్డయ్య తెలిపారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరి అభినందించారు.

సమ్మేటివ్ పరీక్షలు ప్రారంభం



కడపమున్సిపల్ హైస్కూల్ మొయిన్‌లో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న డీఈఓ

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో మంగళవారం సమ్మేటివ్ అసెస్‌మెంట్ -1 పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.విద్యార్థులు నిర్ణీత సమయంలోపే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా పాఠశాల ల హెచ్‌ఎంలు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ నుంచి గంట ముందు ప్రశ్నపత్రాలను తరలించారు. డిప్యూటీ డీఈఓతోపాటు ఆయా మండలాల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.

- కడప నగరం మున్సిపల్ హైస్కూల్ మొయిన్‌లో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షను డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కూడా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే గుడ్లు, చిక్కీ, రాగిజావ వివరాలను రిజిస్టర్లలో నమోదు చేస్తూ ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రైతు చూపు.. ఆకాశం వైపు

- ముఖం చాటేసిన వరుణుడు
- రబీలో 1,48,820 హెక్టార్లకు 41,099 హెక్టార్లలో సాగు
- గతేడాదికంటే తగ్గిన పంటల సాగు విస్తీర్ణం



సాధారణ సాగుకంటే తక్కువ విస్తీర్ణంలో సాగైన వేరుశనగ

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా రబీ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పంటలసాగు అంతంత మాత్రంగానే ఉంది. జిల్లాలో ఈ రబీ సీజన్‌కు సంబంధించి సాధారణసాగు 1,48,820 హెక్టార్లు ఉంటే ఇప్పటికి కేవలం 41,099 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. గతేడాది రబీ సీజన్‌లో ఈ సమయానికి 49,545 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం దాదాపు 8500 హెక్టార్లలో సాగు విస్తీర్ణం తగ్గిందనే చెప్పాలి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవక పోవడంతో ఖరీఫ్ సీజన్‌లో కూడా వంద శాతం సాగు కాలేదు. రబీ సీజన్‌లోనైనా సరైన వర్షం కురుస్తుందని, పంటలసాగు విస్తీర్ణం పెరుగుతుందని అన్నదాతలు ఆశగా చూశారు. కానీ రైతన్నలకు నిరాశే మిగిల్చింది. ప్రభుత్వం మాత్రం రైతులకు కావాల్సిన విత్తనాలను సీజన్‌కంటే ముందే సబ్సిడీతో అందించింది. వారికి కావాల్సిన అన్ని రకాల ఎరువులను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచింది. అయినా ప్రకృతి మాత్రం అనుకూలించలేదు. దీంతో రబీ పంటలసాగు నిరాసజనంగా తయారైంది. డిసెంబర్ 15వ తేదీలోపైనా సరైన వర్షం కురిస్తే లక్ష హెక్టార్లలో శనగ పంట సాగయ్యే అవకాశం ఉంది. పత్తి, నువ్వు, సన్‌ఫ్లవర్, పెసర, మినుము వంటి ఆరుతడి పంటలు కూడా సాగవుతాయని రైతులు తెలిపారు.

- జిల్లాలో శనగపంట సాధారణసాగు 92,944 హెక్టార్లు ఉంటే ఇప్పటి వరకు 13,931 హెక్టార్లలో మాత్రమే సాగైయింది. గతేడాది ఈ సమయానికి 41235 హెక్టార్లలో సాగైంది. అలాగే వేరుశనగకు సంబంధించి గతేడాది 1876 హెక్టార్లు సాగైతే ఈ సంవత్సరం 1649 హెక్టార్లలో సాగైంది. దీంతోపాటు పలు పంటల పరిస్థితి అలాగే ఉంది.

ఆశాజనకంగా మినుముసాగు

జిల్లాలో కొన్ని ఆరుతడి పంటలసాగు విస్తీర్ణం గతేడాది కంటే ఈ సంవత్సరం పెరిగింది. మినుముపంట గతేడాది ఈ సమయానికి 3957 హెక్టార్లలో మాత్రమే సాగైతే ఈ ఏడాది 16638 హెక్టార్లలో సాగైంది. పెసర పంటకు సంబంధించి గతేడాది 356 హెక్టార్లలో సాగైతే ఈ సంవత్సరం 1012 హెక్టార్లలో సాగైంది. మొక్క జొన్న గతేడాది 201 హెక్టార్లలో సాగు కాగా ఈ సంవత్సరం 732 హెక్టార్లలో, వరిపంట గతేడాది 178 హెక్టార్లలోసాగైతే ఈ సంవత్సరం 393 హెక్టార్లలో సాగైంది. కంది పంటకు సంబంధించి గతేడాది ఈ సమయానికి ఒక సెంటు కూడా సాగు కాలేదు. ఈఏడాది 118 హెక్టార్లలో సాగైంది. అలాగే ఉలవ కూడా 125 హెక్టార్లలో సాగైంది. ఇలా మొత్తంగా జిల్లావ్యాప్తంగా 27.62 శాతం మేర పంటలు సాగయ్యాయి.

జిల్లాలో వర్షపాత వివరాలు ఇలా...

నెల	కురవాల్సిన	కురిసింది
జూన్	68.2	38.7
జులై	96.7	77.4
ఆగష్టు	118.4	42.3
సెప్టెంబర్	120	199.7
అక్టోబర్	132.1	30.1
నవంబర్	61.6	22.7



అశలన్నీ వరుణుడిపైనే..

జిల్లాలో వారం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటోంది. కానీ సరైన వర్షం కురవలేదు. దీంతో చాలా మంది రైతులు సబ్సిడీతో తెచ్చుకున్న వేరుశనగ, శనగ, పెసలు వంటి విత్తనాలు ఇళ్లలోనే మగ్గుతున్నాయి.డిసెంబర్ 15వ తేదీలోపు మంచి వర్షం కురుస్తుందని, సాగు విస్తీర్ణం పెరుగుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

ఆరుతడి పంటలు మేలు



జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి సకాలంలో సరైన వర్షాలు కురవకపోవడంతో రబీసాగు అనుకున్న మేర జరగలేదు. అయితే రబీ సీజన్‌కు సంబంధించి శనగ, వేరుశనగలతో కొన్ని ఆరుతడి పంటలసాగుకు డిసెంబర్ 15 వరకు అనకూల పరిస్థితి ఉంది. రైతులు ఆరుతడి పంటలసాగుపై దృష్టి సారించాలి.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

రేపు కడపకు సీఎం వైఎస్ జగన్



కడప సెవెన్‌రోడ్స్: పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం కడప నగరానికి వస్తున్నారు. నంద్యాల జిల్లా అవుకు మండలం మెట్టుపల్లె హెలిప్యాడ్ నుంచి మధ్యాహ్నం 1.00 గంటకు బయలుదేరి 1.30 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 1.40 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 1.55 గంటలకు అమీన్‌పీర్ దర్గా చేరుకుంటారు. 2.00 నుంచి 2.30 గంటల వరకు దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తారు. 2.30 గంటలకు దర్గా నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 2.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 2.55 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 3.35 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన


కడప అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 30న కడప పర్యటన నేపథ్యంలో పెద్ద దర్గా, విమానాశ్రయంవద్ద జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజుతో కలిసి చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పరిశీలించారు.పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ యు. వెంకటకుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది వున్నారు.



పెద్దదర్గాలో భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న ఎస్పీ

కడప గడపలో గండికోట ప్రాభవం

- ఏడురోడ్ల కూడలిలో గండికోట నమూనా
- పర్యాటక రంగానికి మరింత చేయూత
- భావితరాలకు చరిత్ర తెలిపే కృషి



కడప నగరం ఏడురోడ్ల కూడలిలో ఏర్పాటు చేయనున్న గండికోట నమూనా

కడప సిటీ/కల్చరల్ : కడప గడపలో ఇండియన్ గ్రాండ్ క్యానియన్‌గా ప్రాచుర్యం పొందిన గండికోట ప్రాభవం ఆవిష్కృతం కానుంది. దాదాపు వెయ్యేళ్ల నాటి కల్యాణి చాళుక్యుల పాలకుడు చిద్దన చోళ మహారాజు (కాకరాజు) నిర్మించిన ఈ కోటకు గొప్ప పర్యాటక ప్రాంతంగా ఇప్పటికే పేరుంది. ఇంతటి గొప్ప ప్రాముఖ్యతగల దీనికి మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ఇటీవల ఒబెరాయ్ లాంటి అంతర్జాతీయ హోటళ్లను నిర్మించేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. జిల్లా వాసులకు గర్వకారణమైన ఈ కోట నమూనాను కడప నగర వాసులు నిత్యం దర్శించుకునే అవకాశం కలుగుతోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉన్న ఏడురోడ్ల కూడలిలో ఈ దుర్గం నమూనాను ఏర్పాటు చేస్తున్నారు. కడపలోని కూడళ్ల సుందరీకరణలో భాగంగా ఏడురోడ్లలో విశాలమైన కూడలిని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆ కూడలిని చూడగానే నిలువెత్తు దర్పంతో నాటి రాచఠీవి ఉట్టిపడేలా గండికోట నమూనా కనిపించేలా నిర్మాణం సాగుతోంది. పర్యాటక రంగం మరింత పుంజుకునేందుకు భావితరాలకు గండికోట నమూనాతో ఆ చరిత్ర దూరం కాకుండా చేసే ప్రయత్నాల్లో ఈ నిర్మాణం జరగుతోంది. గతంలో ఈ కూడలిలో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహాన్ని కూడా మరింత శోభతో ఇక్కడే ఏర్పాటు చేయనున్నారు. మిగతా కూడళ్లలో కూడా అంతకుముందు ఉన్న విగ్రహాలను మరింత మెరుగు పరిచి నగర వాసుల ఆహ్లాదం కోసం సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

కూడళ్ల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ

కడపలోని కూడళ్ల సుందరీకరణపై జిల్లా ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. అందులో భాగంగానే నగరంలోని దాదాపు అన్ని కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విగ్రహాలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నారు. 2019 నుంచి కడపలోని కూడళ్ల ఆధునీకరణ విషయంపై కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్‌బాబు ప్రత్యేక కసరత్తు చేపట్టి నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగానే ఏడురోడ్ల కూడలిలో గండికోట నమూనా ఏర్పాటు చేసి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

కొనసాగుతున్న ఉరుసు ఉత్సవం



పెద్దదర్గాలో నిర్వహించిన ముషాయిరాలో పాల్గొన్న డిప్యూటీ సీఎం, పీఠాధిపతి



ముషాయిరాకు హాజరైన భక్తులు

కడప కల్చరల్: రాష్ట్రంలోనే పెద్ద ఉత్సవంగానే పేరు గాంచిన కడప పెద్దదర్గా ఉరుసులో భాగంగా నాలుగోరోజు మంగళవారం కూడా వైభవం కొనసాగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ భక్తుల సమస్యలను తెలుసుకుని పరిష్కారాలు సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి ఉరుసుకు హాజరైన ఫకీర్ల కార్యకలాపాలు, నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. హాజరైన చౌదరీలు, ఖలీపాలతో సమావేశమై ఉరుసులో సేవలు అందించినందుకు వారిని అభినందిస్తూ విశేష వస్త్రాలను అందజేశారు.ఉరుసు ఉత్సవాల్లో ముసాయిరాకు ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా హాజరయ్యారు.

- ఉత్సవాల్లో భాగంగా పీఠాధిపతి తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తహలీల్ ఫాతెహా అనంతరం కిష్టిలూటీ (మహా నైవేద్యం) కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు పోటీలు పడ్డారు. సాయంత్రం మలంగ్‌షాను దీక్ష విరమింపజేశారు. రాత్రి ముషాయిరా హాలులో పీఠాధిపతి ఆధ్వర్యంలో అఖిల భారత 79వ జాతీయ ముషాయిరా నిర్వహించారు. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన గొప్ప కవులు ఇందులో పాల్గొని గురువులను స్మరించకుంటూ కవితలను వినిపించారు. పెద్ద దర్గా ఉరుసుకు అన్నమయ్య జిల్లా రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మంగళవారం విచ్చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



మహానైవేద్యం పంపిణీ సందర్భంగా ఫాతెహా చేస్తున్న పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

డిప్యూటీ సీఎం అంజాద్ బాషా



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు తదితరులు

వల్లూరు: రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ప్రజలకు, రైతులకు లో ఓల్టేజీ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్ ద్వారా రాష్ట్రంలోని పలు జిల్లాలతో బాటు వల్లూరు మండలంలోని అంబవరం వద్ద 132/33 కేవీ విద్యుత్‌సబ్ స్టేషన్ ప్రారంభోత్సవాన్ని, వైలవరం వద్ద 1000 మెగావాట్ల సామర్థ్యంలో 750 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వల్లూరు మండలంలోని అంబవరం సమీపంలోని నూతన శాటిలైట్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన శిలా ఫలకాల ఆవిష్కరణ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇప్పటి వరకు వల్లూరు మండల ప్రాంతంలో 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ లేదన్నారు. ఈ ప్రాంత పారిశ్రామిక, వ్యవసాయ, గృహ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా 132 /33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ శాటిలైట్ ఉప కేంద్రం ఏర్పాటు వల్ల కమలాపురం నియోజకవర్గ పరిధిలోని వల్లూరు, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి మండలాలకు చెందిన 30 వేల మంది అభివృద్ధి చెందడానికి దోహదం చేస్తుందని అన్నారు. వ్యవసాయానికి పగటి పూట 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి ఉపయోగపడుతుందని, విద్యుత్ ప్రసారంలో అంతరాయాలను అరికట్టడంతో పాటు పారిశ్రామిక, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి వీలవుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనుబంధంతో జిల్లాలోని మైలవరం మండలంలో 1000 మెగావాట్ల సోలార్ పార్కు అభివృద్ధి కోసం భారత పునరుత్పాదక మంత్రిత్వశాఖ 2015లో ఆమోదం తెలిపిందని అన్నారు. దీనికి ఏపీఎస్పీడీసీఎల్ అన్ని రకాల మౌలిక సదుపాయాలను సమకూరుస్తోందని అన్నారు. ఇందులో భాగంగా 2020లో 250 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేసి ప్రారంభించినట్లు చెప్పారు. రూ 3 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న మిగిలిన 750 మెగావాట్ల ప్రాజెక్టు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు.

- కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మెన్ బద్వేలు షేక్ గౌస్ లాజమ్, రాష్ట్ర ఉద్యానవన సలహాదారు పీ శివ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ కమీషన్ సభ్యులు హిదయతుల్లా, జీసీ గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరధ్వాజ్, అంబవరం, దిగువపల్లె సర్పంచ్‌లు ఓబుల్ రెడ్డి, కుళాయప్ప, ఏపీ ట్రాన్స్‌కో ఎస్‌ఈ (ప్రాజెక్ట్) రాజేంద్ర ప్రసాద్, ఎస్‌ఈ (టెలికాం)మోహన్‌రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ రమణ, డీఈ జీవీ సత్యనారాయణ, విజయ్‌కుమార్ రెడ్డి డిఈఈ సురేఖ రెడ్డిచ కడప సోలార్ ప్రాజెక్టు ఇంజనీర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళి



పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: జ్యోతిరావు పూలే వర్ధంతిని మంగళవారం కడపలో నిర్వహించారు. పాత బస్టాండ్ సర్కిల్ లోని మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా,నగర మేయర్ సురేష్ బాబులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజలకు పూలే అండగా నిలిచి వెనుకబడిన వర్గాల వారికి పూలే ఆశాజ్యోతి అయ్యారన్నారు.

క్లుప్తంగా

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన సురేష్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని కడప రోడ్డులో తాత్కాలిక డంపింగ్ యార్డు సమీపంలో ఉన్న కాశినాయన సత్రం వద్ద తుమ్మలూరు సురేష్ (40) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎర్రగుంట్ల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని మహేశ్వర నగర్ కాలనీలో నివాసం ఉండే సురేష్ పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో కిచెన్‌లో పని చేస్తూ జీవనం సాగించేవాడు. 8 నెలల క్రితం ఇతని భార్య ప్రమాదంలో మృతి చెందింది. ఇద్దరు పిల్లలు కూడా నీటిలో పడి మృతి చెందారు. ఐదు నెలల క్రితం రెండో పెళ్లి చేసుకున్నాడు. అయితే నిత్యం మొదటి భార్య, పిల్లలు మృతి చెందారని మనస్థాపానికి గురవుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి అన్న సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పెట్రోల్ పోసుకుని..


కేజియ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో నివసిస్తున్న అల్లూరి కేజియ (18) అనే యువతి మంగళవారం ఉదయం తన శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై పోలీసులు, మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నగరం అశోక్‌నగర్‌కు చెందిన కేజియ ఇంటర్ వరకు తెలుగు మీడియంలో చదువుకుంది. డిగ్రీలో ఇంగ్లీష్ మీడియంలో పక్కీరుపల్లెలో ఉన్న వివేకానంద డిగ్రీ కళాశాలలో చేర్పించారు. చదువు అర్థం కాకపోవడం, మానసిక ఒత్తిడికి గురి కావడంతో ఉదయం 8 గంటల సమయంలో ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కంపచెట్ల మధ్యన పెట్రోల్ పోసుకుని నిప్పటించుకుంది. మంటలను చూసిన స్థానికులు ఆర్పివేశారు. 108లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి తల్లి సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

ప్రశాంతతకు నిలయం..
పరిపేతురు ఆలయం

- 136 ఏళ్ల చరిత్ర సొంతం
- చెక్కు చెదరని అందం
- డిసెంబర్ 2, 3 తేదీల్లో కలసపాడులో గుడి తిరునాల

కలసపాడు : సగిలేరు ఒడ్డున ఠీవిగా నిలబడి ఉన్న ఆ నిర్మాణం ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. దగ్గరికి వెళ్లి చూస్తే అక్కడి ప్రశాంతత వారిని లోనికి రమ్మని పిలుస్తుంది. లోపలికి వెళితే గుడి అందం ఔరా అనిపిస్తుంది. అపురూపమైన నిర్మాణ శైలి మనస్సుకు హత్తుకుంటుంది. ఆధ్యాత్మికతతో మరో లోకంలోకి తీసుకెళుతుంది. ఒకసారి సందర్శిస్తే మళ్లీ రావాలనిపిస్తుంది. ఆ నిలయమే కలసపాడులోని పరిశుద్ధ పరిపేతురు పరిపాలు ఆలయం.

కలసపాడు సగిలేరు ఒడ్డున పరిశుద్ధ పరిపేతరు పరిపాలు ఆలయం అందానికి ఆధ్యాత్మికతకు నిలయంగా మారింది. డిసెంబర్ 2వ తేదీ నాటికి 136వ ప్రతిష్టా మహోత్సవానికి సిద్ధమైంది. కలసపాడు చుట్టుపక్కల ప్రార్థనలు చేసుకునేందుకు సరైన ఆలయం లేదని భావించిన ఇంగ్లాండ్‌కు చెందిన రెవరెండ్ ఆర్థర్‌ఇన్‌మన్ ఆధ్వర్యంలో 1884లో నిర్మాణం ప్రారంభించారు. మూడేళ్ల నిర్మాణ పనుల అనంతరం అద్భుతమైన ఆలయంగా దీనిని తీర్చిదిద్దారు. 1887 డిసెంబర్ 3 నాటికి పూర్తయింది. ఈ సందర్భంగా ఏటా డిసెంబర్ 2, 3వ తేదీల్లో ప్రతిష్టా మహోత్సవాన్ని గుడి తిరునాలగా జరుపుతున్నారు. ఈ ఏడాది 136వ ప్రతిష్టా మహోత్సవం జరగనుంది. జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి లక్షల మంది భక్తులు ఉత్సవాలకు తరలి వస్తారు.


కలసపాడులోని పరిశుద్ధ పరిపేతురు పరిపాలు ఆలయం

ఆకట్టుకునే ఇటుకల నిర్మాణం

ఆలయ నిర్మాణంలో వాడిన ఇటుకలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. స్థానికంగా దొరికే బంకమట్టితో ఇటుకలను తయారు చేశారు. వీటిని ఇసుక, సున్నం, బెల్లం, వీటికి లక్షల సంఖ్యలో కోడిగుడ్లను కలిపి గానుగతిప్పి తయారు చేసిన గచ్చుతో నిర్మించారు. నునుపుదనం కోసం వేసే పైపూతలో కూడా గుడ్ల మిశ్రమాన్ని ఉపయోగించారు. ఆధునికత ఉట్టిపడేలా టేకు, తాటి చెక్కలను వినియోగించారు. కేరళ పెంకులతో పైకప్పును నిర్మించారు. తలుపులు, కిటికీలు టేకుతో తయారు చేశారు.

లక్షల్లో తరలిరానున్న భక్తులు

ఏటా గుడి తిరునాలకు లక్షల్లో భక్తులు తరలివస్తారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాక కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతోపాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. 3వ తేదీన ఉదయాన్నే భక్తులు తలనీలాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. స్వామికి భారీగా కానుకలు సమర్పించుకుంటారు.

ప్రత్యేకతలు

ఆలయంలో నిర్మించిన గంటగోపురం, బాప్టీజం తొట్టి ప్రత్యేకమైనవిగా చెప్పవచ్చు. చర్చిలోపల ముఖద్వారం వద్ద బాప్టీజం తొట్టి ఉంది. ఆలయంలోకి వచ్చే భక్తులు తొట్టిలోని నీటిని చల్లుకుని బాప్టీజం పొందుతారు. సుదూర ప్రాంతాల నుంచి తమ పిల్లలకు బాప్టీజం ఇప్పించేందుకు భక్తులు ప్రతిష్టా మహోత్సవాలకు తరలివస్తారు. గుడి వెలుపల ఏర్పాటు చేసిన గంటను మరో ప్రత్యేకతగా పేర్కొనవచ్చు. గడియారం లేని రోజుల్లో సమయాన్ని తెలిపేందుకు అక్కడి గంటను మోగించేవారు. 40 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ గంట ఆ నాటి నుంచి భక్తులను ఆకట్టుకుంటూనే ఉంది.


ఆకట్టుకునే చర్చి లోపలి భాగం


చెక్కు చెదరని చర్చి అందం


చర్చిలోని బాప్టీజం తొట్టి

నవశకం

పాఠశాలలు ఆహ్లాదకరంగా ఉన్నాయి



ప్రభుత్వ పాఠశాలలు అన్ని సౌకర్యాలతో ఆహ్లాదకరంగా రూపు దిద్దుకున్నాయి. మా రోజుల్లో వర్షం వస్తే నీళ్లు కారే కొట్టాల్లో కూడా చదువు చెప్పాల్సి వచ్చింది. ఇప్పుడు పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయి. మధ్యాహ్న భోజన విషయంలో ప్రభుత్వం పూర్తి విలువలను పాటిస్తోంది. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లతోపాటు విద్యార్థులు చదువుకునేందుకు అనువైన వాతావరణం కల్పించింది.

– డాక్టర్ మూలె రామమునిరెడ్డి,
విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రొద్దుటూరు.

సొంతింటి కల నెరవేరింది



మేము కొంత కాలం క్రితం వేరే చోట నుంచి వచ్చి పెద్దపసుపుల గ్రామంలో స్థిరపడ్డాం. బాడుగ ఇంట్లో ఉంటూ పనులకు వెళ్లేవాళ్లం. గతంలో ఇంటి కోసం అర్జీలు పెట్టుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. అయితే జగనన్న ప్రభుత్వం ఏర్పడ్డాక వలంటీర్ ద్వారా ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. పట్టా కూడా చేతికి ఇచ్చారు. ఇల్లు కట్టుకున్నాం. దీంతో ఎన్నో ఏళ్ల మా సొంతింటి కల నెరవేరింది. మా లాంటి పేదలకు ప్రభుత్వం చేదోడుగా నిలుస్తోంది.

– సావిత్రి,
పెద్దపసుపుల, పెద్దముడియం మండలం

సీఎంకు రుణపడి ఉంటా



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మా గ్రామంలో నిర్వహించారు. నేను కంట పరీక్షలు చేయించుకున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఆరోగ్యశ్రీ పథకంలో నా కంటికి ఆపరేషన్ చేశారు. ఇప్పుడు నాకు కంటి చూపు బాగా కనిపిస్తోంది. వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటా. – కోన నిర్మలమ్మ,
రాగిమానుపల్లె, పులివెందుల మండలం

రైతు పక్షపాతి వైఎస్ జగన్

వైఎస్సార్ జలకళ ప్రారంభ సభలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : రైతులు అన్ని విధాలుగా బాగుండాలనే తపన నాడు వైఎస్సార్‌లో ఎలా ఉండేదో నేడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌లో కూడా అలానే ఉందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలో మల్లేపల్లె పంచాయతీ చెంచయ్యగారిపల్లెలో నీటి యాజమాన్యం సంస్థ ద్వారా రైతులకు మంజూరైన వైఎస్సార్ జలకళ బోర్లను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రైతులకు ఇప్పటికే చెప్పిన దానికన్నా అధికంగా వనరులు అందించారన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు పరచలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా పథకాలు అందిస్తోందన్నారు. ప్రజలు కూడా మేలు చేసే వారిని గుర్తుంచుకోవాలని కోరారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మేకల రత్నకుమార్‌యాదవ్, ఎంపిడీఓ వెంగమునిరెడ్డి, ఏపీడీ జుబేదా, పంచాయతీ ఉపసర్పంచ్ చిలేకాంపల్లె కొండారెడ్డి, ఉపాధి, నీటియాజమాన్య సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


చెంచయ్యగారిపల్లెలో వైఎస్సార్ జలకళ బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

అనుబంధ రంగాల్లో
వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : గ్రామీణ యువత, మహిళలు వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల్లో వృత్తి నైపుణ్యం పెంచుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఊటుకూరు ఏరువాక కేంద్రంలో అంతర్జాతీయ చిరుధాన్యపు సంవత్సరం సందర్భంగా చిరుధాన్యాల విలువ జోడింపుపై రైతులకు నైపుణ్య శిక్షణ నిర్వహించారు. హైదరాబాద్ మానేజ్, గుంటూరు సమ్మెటి వారి ఆర్థిక సహకారంతో ఏరువాక కేంద్రం, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువత, మహిళలు, అభ్యుదయ రైతులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారవేత్తలుగా ఎదగడానికి మంచి అవకాశం అన్నారు. చిరుధాన్య పంటలైన రాగి, సజ్జ, జొన్న, కొర్ర, అరిక, సామ, ఊద, అండు కొర్ర పంటలు ఇతర పంటలతో పోలిస్తే తక్కువ ఖర్చు, పరిమిత యాజమాన్యం పద్ధతులతో సాగు చేసుకోవచ్చన్నారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అధిక పోషక విలువలున్న చిరుధాన్య ఉత్పత్తులకు ఇటీవల కాలంలో మంచి డిమాండ్ ఉందన్నారు. ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ, కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ చిరుధాన్యాలు అధిక పోషక విలువలు కలిగి గ్లుటేన్ రహితమై తేలికగా జీర్ణమయ్యే స్వభావం కలిగి ఉంటాయన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి శ్రీనివాసాచారి మాట్లాడుతూ ఇలాంటి ఉత్పత్తుల వలన మంచి ఉపాధి పొందవచ్చన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఏరువాక కేంద్ర విస్తరణ శాస్త్రవేత్త రామలక్ష్మిదేవి, కేవీకే సామాజిక శాస్త్రవేత్త ప్రశాంతి, ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత, కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, సాయి మహేశ్వరి, మహేష్‌బాబు, మానస, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

ఆర్టీపీపీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల ఆందోళన


ఆర్టీపీపీలో ఆందోళన చేస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఉత్పత్తికి తగ్గ మ్యాన్ పవర్ ఉండాలని గత మూడేళ్ల నుంచి అనేకసార్లు విన్నవించినా యాజమాన్యం పట్టించుకోకపోవడంతో మంగళవారం ఆర్టీపీపీలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఆర్టీపీపీలో 90 శాతం పైగా ఉత్పత్తి చేస్తున్న యాజమాన్యం ఉత్పత్తికి తగ్గట్టుగా అసిస్టెంట్ ఇంజినీర్ల నియామకాలు చేపట్టలేదన్నారు. పోస్టులను కూడా కుదించిందని తెలిపారు. దీని వల్ల తమపై పనిభారం ఎక్కువైందన్నారు. న్యాయమైన సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం

కడప కల్చరల్ : క్రైస్తవులందరూ ఒకే కుటుంబ సభ్యులు లాంటి వారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళతామని ప్రభుత్వ క్రైస్తవ సలహాదారు ఫాదర్ బాలస్వామి అన్నారు. మంగళవారం కడప సీఎస్ఐ సెంట్రల్ చర్చి సమావేశ మందిరంలో ఆ డయాసిస్ బిషప్ ఐజాక్ వరప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కడప ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. జిల్లాలోని క్రైస్తవ సమాజానికి మేలు చేసే విధంగా, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తప్పక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లెం విజయభాస్కర్ ఆయనకు క్రైస్తవుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇమ్రాన్, మరియాపురం విచారణ గురువు బిరుసు రాజా, బిషప్ హౌస్ కార్యదర్శి ఫాదర్ పి.దేవదాసు, ఎంపీఎస్ఎస్ డైరెక్టర్ ఫాదర్ టి.బాలరాజు, శ్యాంసన్, మనోహర్, ప్రభాకర్, సుధాకర్, కథోలిక చర్చి సిస్టర్లు, సీఎస్ఐ చర్చి పాస్టర్ మత్తయ్యబాబు, శాంతి సేవా సొసైటీ అధ్యక్షుడు మడగలం ప్రసాద్, విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ క్రైస్తవ సలహాదారు ఫాదర్ బాలస్వామిని సత్కరిస్తున్న గురువులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


నాగమునెయ్య(ఫైల్)

చింతకొమ్మదిన్నె : మండలంలోని బలిజపల్లి గ్రామానికి చెందిన పాత్తూరు నాగమునెయ్య (40) సోమవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీకేదిన్నె ఎస్ఐ బి. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన సమాచారం మేరకు నాగమునెయ్య మద్యానికి బానిసై డబ్బుల కోసం భార్యతో గొడవపడేవాడు. సోమవారం మధ్యాహ్నం మద్యానికి డబ్బులు కావాలని అతని భార్య సంపూర్ణను అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో వాదులాటకు దిగాడు. అదే రోజు అర్ధరాత్రి అతని కాలిపై మచ్చుకత్తితో నరికినట్లు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు అతని భార్య తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి భార్యను విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రపంచ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినికి ఆర్థిక సాయం

కమలాపురం : ప్రపంచ స్కిప్పింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన మండలంలోని రామచంద్రాపురానికి చెందిన కావేటి భవ్యశ్రీకి బందెల వెంకటేష్ రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కావ్యశ్రీ నిరుపేద కుటుంబానికి చెందిన క్రీడాకారిణి. పుల్లంపేటలోని కేజీబీవీలో పదవ తరగతి చదువుతోంది. స్కిప్పింగ్ క్రీడలో అత్యంత ప్రతిభ కనబరిచి థాయిలాండ్‌లో త్వరలో జరిగే ప్రపంచ స్కిప్పింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైంది. అక్కడికి వెళ్లడానికి ఆర్థిక సాయం అందించాలని విద్యార్థిని తండ్రి రామక్రిష్ణ మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ జూటూరు విజయ్ కుమార్‌ను అభ్యర్థించాడు. విజయ్ అభ్యర్థన మేరకు బందెల వెంకటేష్ రూ.20వేల ఆర్థిక సాయం చేశారు. అలాగే రెండు రోజుల క్రితం కామన్ మెన్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు రాజారెడ్డి సైతం రూ.16 వేలు అందజేశారు.

నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ విజయరామరాజు

సింహాద్రిపురం : అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో దాదాపు రూ.200కోట్లతో జరుగుతున్న పనులను ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం డిసెంబర్ నెలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండల పర్యటనకు వస్తున్న సందర్భంగా హెలీకాప్టర్ ల్యాండ్ అవ్వడానికి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శేఖరరెడ్డి, అరవిందనాథరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, హరినాథరెడ్డి, వెలుగోటి చంద్రశేఖరరెడ్డి, కిశోర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, బాబురెడ్డి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

పులివెందుల మోడల్‌టౌన్ పనులపై సమీక్ష

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మోడల్ టౌన్ అభివృద్ధి పనులపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఉంటుందని.. ఆయన వచ్చే నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాత మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు, మినీ సెక్రటేరియట్ నిర్మాణ పనులు, క్రికెట్ స్టేడియం, రింగ్ రోడ్డులో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతోపాటు అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


సింహాద్రిపురంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు, తదితరులు

పారదర్శకంగా కులగణన

తిరుపతి అర్బన్ : పారదర్శకంగా శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపడతామని తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ పరిధిలోని ప్రియదర్శిని ఆడిటోరియంలో మంగళవారం కులగణన ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్, అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన కులసంఘం నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగితోపాటు వలంటీర్ కులగణనలో పాల్గొంటారని వెల్లడించారు. ఇంటి సభ్యుల బయోమెట్రిక్‌తోపాటు, సచివాలయ బయోమెట్రిక్ ఉంటేనే యాప్ తీసుకుంటుందని స్పష్టం చేశారు. వంద శాతం పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తొమ్మిది దశాబ్దాల తర్వాత కుల గణన చేపడుతున్నట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కులాలు మినహా మిగిలిన వారిని జనరల్ కేటగిరీ కింద లెక్కిస్తూ వస్తున్నారని వివరించారు. కులాల వారీగా జనాభా లెక్కించడం వల్ల ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఉపయోగపడతుందని వివరించారు. కుల సంఘాలతోపాటు రాజకీయపార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంఘాల నేతలు సంపూర్ణంగా సహకరించాలని ఆయన కోరారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, చిత్తూరు మేయర్ అముద తదితరులు మాట్లాడారు. సదస్సులో వివిధ జిల్లాల కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి